క్లుప్తంగా

ఫిజియోథెరపీపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ

సామర్లకోట: సమాజంలో ఆరోగ్యకమైన జీవన విధానానికి విద్యాశాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయులు వివిధ వైద్యపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. శనివారం స్థానిక గిరిజన సమీకృత పాఠశాలలో మండల స్థాయి హెచ్ఎంలకు ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వై శివ రామ కృష్ణయ్య, నిజాం ఇనిస్టిట్యూట్‌కి చెందిన ఫిజియోథెరపీ వైద్యులు మహేష్, రమేష్ నడుం, మోకాలు నొప్పులు తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎం.ప్రసాద్, తోటకూర సాయిరామకృష్ణ తదితరులు ఫిజియోథెరిపీపై అవగాహన కల్పించారు.

శ్రీపాదశ్రీవల్లభ స్వామికి లక్ష తులసి అర్చన



శ్రీపా శ్రీవల్లభ స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి లక్ష తులసి అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. పాదగయ క్షేత్రంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తరించారు.

జాగ్రత్తలతోనే టీబీ నివారణ



టీబీ రోగులకు న్యూట్రిషన్ సపోర్టు అందజేసిన డాక్టర్లు

సామర్లకోట: టీబీ రోగులు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా టీబీని జయించవచ్చునని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ కంట్రోల్ అధికారి డాక్టరు ఆర్.రమేష్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి టీబీ ముక్తి అభియాన్ ద్వారా టీబీ పేషెంట్స్‌కి న్యూట్రిషన్ సపోర్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ ఆస్పత్రి పరిధిలోని 80 మంది టీబీ రోగులకు ప్రధానమంత్రి టీబీ ముక్తి అభియాన్ ద్వారా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారికి సహకారంతో ఏర్పాటు చేసిన న్యూట్రీషన్ సపోర్టు అందజేశారు. ఈ కార్యక్రమానికి సామానికి ఆరోగ్య కేంద్రం డాక్టరు పి.అమల అధ్యక్షత వహించారు. వైద్యుడు రమేష్, సామాజిక కేంద్రం సిబ్బంది పి.సుబ్బారావు, వై.రామలింగేశ్వరరావు, ఎస్.రామకృష్ణ, భవ్య, వి.శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ



పిఠాపురంలో మానవహారంగా ఏర్పడిన అధికారులు

పిఠాపురం: అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా డెమోక్రసీని బలోపేతం చేయాలని పిఠాపురం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో శనివారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పిఠాపురం, గొల్లప్రోలులో ర్యాలీలు నిర్వహించిన సిబ్బంది మానవహారంగా ఏర్పడి ఓటుహక్కు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల కమిషనర్లు కృష్ణవేణి, సత్యనారాయణ, తహసీల్దార్లు త్రినాథరావు, వెంకటేశ్వరరావు, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



సామర్లకోట మాండవ్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వారంలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు



పాత సామర్లకోటలో వేణుగోపాలస్వామిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు



పులిమేరులో వేంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు



గొల్లప్రోలులో వేంకటేశ్వరస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

కనుల 'వైకుంఠం'

- వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- తెరుచుకున్న ఉత్తర ద్వారాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

పిఠాపురం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ఉత్తర (వైకుంఠ) ద్వారాలు తెరుచుకోవడంతో వేలాది మంది భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి క్యూ కట్టారు. ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి రోజున దేవతలు దివి నుంచి భువికి దిగివస్తారనే నానుడి ఉండడంతో ఆలయాల్లో ఉత్తర ద్వారాలు తెరుస్తారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉత్తర ద్వారాలను తెరవడంతో భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురం కుంతీ మాధవస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 50 వేల మంది భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. వైకుంఠద్వార దర్శనం రాత్రి 9 గంటల వరకూ కొనసాగించారు. స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి, సీతారామాంజనేయ స్వామి, గొల్లప్రోలు వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనంతో పాటు దశావతారాల పూజ, నిత్యదేవతార్చనలు నిర్వహించారు. పిఠాపురం తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారికి దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్తపల్లి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్తపల్లి వేణుగోపాలస్వామి, కొండెవరం, ఉప్పాడ, కోపపాపపేటలోని వేంకటేశ్వరస్వామి, రమణక్కపేట విజయజనార్దనస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఎండపల్లి రామాలయం వద్ద ఏకాహం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉప్పాడలో అన్నసమారాధన

ఉప్పాడ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 3 వేలు మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా లక్షగాజుల అర్చన

కొత్తపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం కొమరగిరిలో వేంచేసిన లక్ష్మీదేవి అమ్మవారికి లక్షగాజుల అర్చన నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన అప్పల రాజేంద్రప్రసాద్ దంపతులు అమ్మవారికి లక్ష గాజుల అర్చన చేశారు. పూజ చేసిన గాజులను ముత్తయిదువులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా స్వామివారి గ్రామోత్సవం

సామర్లకోట: అతిపురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణ స్వామి గ్రామోత్సవం శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సాయంత్రం ప్రత్యేకంగా అలంకరణ చేసిన గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం జరిగింది. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ప్లైఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, నీలమ్మ చెరువు, యార్లగడ్డవారి వీధి, మఠంసెంటర్, అయోధ్యరామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం రాత్రి ఆలయానికి చేరింది. భక్తుల స్వామి వారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ముక్కోటి ఏకాదశి పూజలు

పెద్దాపురం: మక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి ఆయా ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయాల్లో ఏకాహ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్డు వెంకటేశ్వరస్వామి గుడి వద్ద భక్తులు పోటెత్తగా, స్వామివారిని ఉత్తరం ద్వారం నుంచి దర్శించుకున్నారు. మండలంలోని జి.రాగంపేట వేణు గోపాలస్వామి, కట్టమూరు కేశవపట్టాభి స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్విహించారు. అనంతరం మెయిన్‌రోడ్డులో అఖండ దీపారాధన ఘనంగా నిర్వహించారు. కాండ్రకోట గీతా సంఘం ఆధ్వర్యంలో గోపూజ నగర సంకీర్తన నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం పూజలు చేశారు. పులిమేరులో వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు

సామర్లకోట: ముక్కోటి ఏకదశి సందర్భంగా శనివారం మండలంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణ పరిధిలో గోదావరి కాలువ ఒడ్డున వేంచేసి ఉన్న అతిపురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి,భూదేవి సమేత నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం గ్రామోత్సవం జరిగింది. పాత సామర్లకోటలో ఉన్న వేణుగోపాలస్వామి వారిని ఉత్తర ద్వారం మీదుగా దర్శించుకొవడానికి భక్తులు బారులు తీశారు. పెద్దాపురం రోడ్డులో విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా వేంచేసి ఉన్న శ్రీరాధా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వారం మీదుగా దర్శనం చేసుకున్నారు. పట్టణ పరిధిలోని జగదీశ్వరస్వామి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వారం మీదుగా స్వామి వారిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినంలో స్వామిని దర్శించుకొవడం ద్వారా మోక్షం ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు, పారిశ్రామిక వేత్త గోలి దర్మరాజు, వల్లూరి శేఖర్‌లు భక్తులకు సేవ లందించారు.



యండపల్లిలో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు



పిఠాపురంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



సామర్లకోటలో మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో కుంతీమాధవస్వామి



ఉప్పాడలో వేంకటేశ్వరస్వామి

పేదల ఇంట.. సంక్షేమ పంట

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- సామర్లకోటలో గడప గడపకూ మన ప్రభుత్వం
- ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



సామర్లకోటలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: పేదల గడప వద్దకే రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేరుతున్నాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం సామర్లకోట మున్సిపాలిటీలో ఉదయం 4వార్డులోను, సాయంత్రం 7వ వార్డులోను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆ వార్డు కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, జట్ల మోహన్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని దవులూరి దొరబాబు అన్నారు. ఈ సందర్భంగా దొరబాబు విలేకర్లతో మాట్లాడారు. గడప గడపకూ తిరిగిన సమయంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేలా అధికారులు కూడా భాగస్వామ్యం చేశామన్నారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే అధికారులతో సమన్వయం చేసుకొని వారికి న్యాయం జరిగేలా చేస్తామని తెలిపారు. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రతీ ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, పార్టీ సీనియర్ నాయకులు రెడ్నం దొరబాబు, దర్శిపాటి సత్యనారాయణ, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, గృహ సారధుల పట్టణ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, సేపెని సురేష్, రెడ్డి లోవకుమారి, క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్ సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతకు మరో అవకాశం ఇవ్వండి



మల్లాంలో వాటర్ టాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పిఠాపురం: అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో ప్రతిపక్షాలు ప్రజలను పట్టించుకోలేదన్నారు. అలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ సైతం పేద ప్రజలకు ఏ లోటు రాకుండా చూసుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో ఎవ్వరూ ఎప్పుడూ చేయలేని అభివృద్ధి పనులు సీఎం జగన్ ఒక్కరే చేశారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం పిఠాపురం మండలం మల్లాంలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.1.70 కోట్లతో నిర్మించనున్న వాటర్ టాంకుకు ఆయన శంకుస్థాపన చేశారు. గొల్లప్రోలు మండలం కొడవలిలో రూ.30 లక్షలతో నిర్మించే మెయిన్ రోడ్డుకు భూమిపూజ చేశారు. రూ.76.60 లక్షలతో చేపట్టే వాటర్ టాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లో భాగంగా నిర్మించిన కుళాయిలను ఆయన ప్రారంభించారు. గ్రామ దేవత గంగాలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, అరిగెల రామయ్యదొర, మొగలి బాబ్జి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్రాపై ప్రత్యేక దృష్టి



ఆడుదాం ఆంధ్రా సమీక్షలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్



కొత్తపల్లిలో ర్యాలీ చేస్తున్న అధికారులు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దాపురం ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో క్రీడా ప్రతిభ ఉంటుందన్నారు. దానిని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా క్రీడా పోటీలును నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఈ నెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలోని పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎఈఓ ప్రభాకర శర్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహన ర్యాలీ

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటనారాయణ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్ వరకూ ఆడుదాం ఆంధ్రా క్రీడలపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెల 26 నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పతంజలి శాస్త్రికి అభినందనలు



పతంజలి శాస్త్రిని సన్మానిస్తున్న డాక్టర్ ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ సభ్యులు (ఫైల్)

పిఠాపురం: సుప్రసిద్ధ తెలుగు రచయిత పతంజలి శాస్త్రి రచించిన రామేశ్వరం కాకులు కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడంపై పిఠాపురానికి చెందిన కవులు, సాహిత్య ప్రియులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పిఠాపురంలో డాక్టర్ ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పతంజలి శాస్త్రి అభినందన సభ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పిఠాపురంలో జన్మించిన పతంజలి శాస్త్రికి ప్రముఖ కవి సోమసుందర్‌కు చక్కటి సాహిత్య అనుభందం ఉందన్నారు. ఆయన వర్ధమాన కవులకు ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ సభ్యులు కె.వెంకటరావు, గజరావు సీతారామస్వామి, మేకా మన్మదరావు, ఆవంత్స శశికాంత్ శాతకర్ణి, కిలారి గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శృంగారవల్లభుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి



స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం ఆలయ చైర్మన్ కర్రి వెంకట రామజగదీశ్వరరావు, కార్యనిర్వహణాధికారి పులి నారాయణ మూర్తి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సంకీర్తన, భజన, సప్తాహ మహోత్సవాన్ని నిర్వహించారు. సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెలుగుల సురేష్ భారీ బందోబస్తు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కుంచే వెంకన్న, జగ్గరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.7,82,130 ఆదాయం సమకూరినట్లు ఈఓ నారాయణమూర్తి తెలిపారు.

కేంద్రం పథకాలందజేయడమే లక్ష్యం



వికసిత్ భారత్‌లో ప్రసంగిస్తున్న ఈఓపీఆర్‌డీ రాజశేఖర్

పెద్దాపురం: అర్హత ఉండి కేంద్ర ప్రభుత్వం పథకాలు అందని వారికి వాటిని అందజేయడమే లక్ష్యంగా వికసిత్ భారత్ ప్రచార యాత్ర చేపట్టిందని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడానికే వికసిత్ భారత్ రూపొందించామన్నారు. బీజేపీ నాయకులు తుమ్మల పద్మ, పెదిరెడ్డి కిరణ్, విత్తనాల వెంకటరమణ, దువ్వా శ్రీదేవి, చెరుకూరి రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వికసిత్ భారత్ యాత్రపై ప్రజలకు అవగహన కలిప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్‌టిఆర్ రమేష్, కళ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌పై అధికారుల దాడులు

యతిపై నాలుగు కేసుల నమోదు



సామర్లకోట యతి రెస్టారెంట్‌లో తనిఖీలు చేసిన వివిధ శాఖల అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఉన్న యతి రెస్టారెంట్‌పై శనివారం సాయంత్రం విజిలెన్సు, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. రెస్టారెంట్‌లోని ఫుడ్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు దాడి చేశారు. లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం 150 కిలోలు, 30 కిలోల కెపాసిటీ వెయింగ్ మెషన్లకు స్టాంప్ లేన్నట్లుగా గుర్తించి కేసు నమోదు చేశారు. రెస్టారెంట్‌లో గడువు ముగిసిన రెండు కుకీల ప్యాకెట్లు లభించడం, చికెన్ నిల్వ చేసి ఉండడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసులు నమోదు చేశారు. యతి రెస్టారెంట్‌కు బదులుగా సరి ఫుడ్ పేరుతో సర్టిఫికెట్ ఉండడంతో ఆహారా భద్రతా ప్రమాణాల చట్టం ప్రకారం మరో కేసు నమోదు చేశారు. రెస్టారెంట్‌లో ఎడిబుల్ ఆయిల్స్‌లో టోటల్ కాంఫౌండ్స్ మీటర్ రీడింగ్ అనుమతించదగిన పరిమితులకు లోబడి గుర్తించామని అధికారులు తెలిపారు. ఈ మేరకు చికెన్ ధమ్ బిర్యానీ, మిర్చి ఫౌడర్ నమూనాలను విశ్లేషణ కోసం నాదారంలోని ఫుడ్ లాబోరేటరికి పంపుతున్నట్టు రీజనల్ విజిలెన్సు ఇంచార్జి ఎస్పీ ఎ.సురేష్‌బాబు తెలిపారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెస్టారెంట్లలో ఉపయోగిస్తున్న ఎడిబుల్ ఆయిల్స్ టోటల్ పోలార్ కాంపౌండ్స్ మీటరు రీడింగ్ 25 శాతం లోపు ఉండాల్సిన కన్నా ఎక్కువగా ఉంటున్నాయని ఆయన తెలిపారు. దీని కారణంగా ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. నిబంధనలు పాటించకపోతే రెస్టారెంట్ల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెస్టారెంట్లు, బార్ల పరిసరాలు, కిచెన్లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టరు వెంకటనాగరాజు, బయాలిజిస్టు లక్ష్మీనారాయణ, సబ్ ఇన్‌స్పెక్టరు జగన్నాథరెడ్డి, కానిస్టేబుల్స్ లోవకుమార్, కిషోర్, వీఆర్వో భరత్‌లు పాల్గొన్నారు.